భయం.. భయంగా

- ఏపుగా పెరిగిన జామాయిల్ వృక్షాలు
- ఇళ్లపైకి వాలుతూ.. కొమ్మలు విరిగిపడుతూ..
- వణుకుతున్న కాలనీ వాసులు



ద్వారకాపురి కాలనీలో ఇళ్లకు ఆనుకొని ఉన్న భారీ జామాయిల్ వృక్షాలు



విరిగిపడిన జామాయిల్ చెట్ల కొమ్మలు

సత్తుపల్లిటౌన్: ఏ కొద్దిపాటి గాలివీచినా ఆ కాలనీలు గజగజా వణుకుతున్నాయి.. ఎప్పుడు ఏ చెట్టు ఇంటిమీద పడుతుందోనని గ్రామస్తులు బిక్కుబిక్కుమంటూ గడుపుతున్నారు. సత్తుపల్లి పట్టణంలోని ద్వారకాపురి కాలనీ, గాంధీనగర్, విరాట్‌నగర్, జవహర్‌నగర్ కాలనీలతో పాటు ఆర్‌అండ్‌బీ గెస్ట్‌హౌస్ నుంచి అటవీశాఖ కార్యాలయం వరకు జాతీయ రహదారి వెంట వందలాది భారీ జామాయిల్ వృక్షాలు ఉన్నాయి. సుమారు 20 నుంచి 25 ఏళ్ల వయస్సు ఉన్న ఈ వృక్షాలు 60 నుంచి 100 అడుగుల ఎత్తుతో పాటు మీటరు వరకు వ్యాసార్థం కలిగి ఏపుగా పెరిగాయి. అటవీశాఖకు చెందిన స్థలంలో ఉన్న ఈ వృక్షాలకు ఆనుకొని కాలనీలు ఉండటంతో ఆయా కాలనీల వాసులు భయం.. భయంగా.. గడపాల్సివస్తోంది.

కొమ్మలు విరిగి పడటం.. ఇళ్లను తాకటం..

వర్షాకాలంలో వీచే గాలులకు, వర్షాలకు కాలనీ ప్రజలు ప్రాణాలు అరచేతిలో పెట్టుకొని బతుకుతున్నారు. గతంలో ద్వారకాపురి కాలనీ, విరాట్‌నగర్‌లలోని ఇళ్లపై భారీ ఈదురు గాలులకు జామాయిల్ చెట్లు ఇళ్లపై పడిపోవటంతో ఇళ్లు దెబ్బతిన్నాయి. ప్రతి నిత్యం కొమ్మలు విరిగి పడటంతో ఎప్పుడు ఏం జరుగుతుందోనని గ్రామస్తులు ఆందోళన చెందుతున్నారు. ఈదురు గాలులకు ఈ చెట్లు ఒంగి చివరలు ఇళ్లను తాకుతున్నాయని దీంతో ఇళ్లల్లో ఉండాలంటే భయపడాల్సి వస్తుందని కాలనీ వాసులు లబోదిబోమంటున్నారు.

మురికికూపం.. చెత్తా చెదారం..

జామాయిల్ చెట్ల నుంచి నిత్యం ఆకులు రాలుతుండడంతో రోడ్లపై ఎప్పుడు చెత్తా చెదారం ఉంటుంది. దీంతో పక్కన ఉన్న నివాసాల ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. చెట్ల కింద మురుగు చేరటంతో పందులకు నిలయంగా మారింది. దీంతో దోమలు వృద్ధిచెంది స్వైర విహారం చేస్తుండటంతో స్థానికులు తీవ్ర అవస్థలు పడుతున్నారు. అంతేకాకుండా వేసవిలో వీచే ఈదురు గాలులకు చెట్లు, కొమ్మలు విరిగి పక్కన ఉన్న కరెంట్ తీగలపై పడడంతో విద్యుత్‌కు అంతరాయం కలుగుతుందన్నారు. ఇప్పటికైనా ప్రజాప్రతినిధులు, అధికారులు స్పందించి జామాయిల్ చెట్లను తొలగించి కాలనీ వాసుల కష్టాలు తీర్చాలని వేడుకుంటున్నారు.

భయమేస్తోంది..



ఎండాకాలం వచ్చిందంటే ఈదురు గాలులకు జామాయిల్ చెట్లు ఇంటి మీదకు వచ్చి వాలిపోతున్నాయి.. ఎప్పుడు చెట్లు, చెట్ల కొమ్మలు విరిగి పడతాయోనని భయమేస్తోంది. అధికారులకు ఎన్నిసార్లు చెప్పినా పట్టించుకోవటం లేదు. ఈ సమస్యను పరిష్కరించేందుకు ప్రజాప్రతినిధులు చొరవ తీసుకోవాలి.

– టి.శిరీష, ద్వారకాపురి కాలనీ, సత్తుపల్లి

చెట్లు తొలగించాలి..



జామాయిల్ చెట్లు విరిగి ఇళ్లపై పడుతున్నాయి. నరికిస్తామంటున్నారే కానీ.. తొలగించటం లేదు. కూలీ పనులు చేసుకుంటూ కుటుంబాలు వెళ్ల దీస్తున్నాం. ఇళ్లపై పడితే మళ్లీ కట్టుకునే పరిస్థితి లేదు. విపరీతంగా చెత్త పడుతోంది. ఇళ్లల్లోకి విష సర్పాలు వస్తున్నాయి. ఇంకా ఎన్నిరోజులు ఇలా గడపాలో అర్థం కావడలేదు. చెట్లు తొలగించి న్యాయం చేయాలి.

– బి.కృష్ణవేణి, ద్వారకాపురి కాలనీ, సత్తుపల్లి

క్లుప్తంగా

స్త్రీనిధి బకాయిలు వసూలు చేయండి

సత్తుపల్లిరూరల్: మహిళా సంఘాల్లో సభ్యులు స్త్రీనిధి ద్వారా తీసుకున్న రుణాలను నెలాఖరులోగా వసూలు చేయాలని డీఆర్‌డీఏ డీపీఎం శ్రీనివాసరావు సిబ్బందిని ఆదేశించారు. సత్తుపల్లిలో సత్తుపల్లి, వేంసూరు, పెనుబల్లి, కల్లూరు మండలాల సిబ్బందితో గురువారం సమావేశమయ్యారు. ఈ సందర్భంగా శ్రీనివాసరావు మాట్లాడుతూ.. రుణాల వసూళ్లలో నిర్లక్ష్యం వహించొద్దని తెలిపారు. ఏపీఎంలు రామారావు, సుబ్బారావు, శ్రీనివాసరావు, జ్యోతి, డీఎంజీ జనార్దన్‌రావు, మేనేజర్ చంటి, కుసుమ తదితరులు పాల్గొన్నారు.

జాతర ఆదాయం రూ.4.66 లక్షలు

కల్లూరు: మహాశివరాత్రిని పురస్కరించుకుని కల్లూరులోని శ్రీ కాశ్మీర మహాదేవ క్షేత్రం ఆదాయం రూ.4.66 లక్షలు వచ్చింది. గురువారం దేవాదాయశాఖ ఆధ్వర్యంలో లెక్కింపు జరిగింది. ఇందులో వేలం పాట రూ.1.56 లక్షలు, అభిషేకాలు, దర్శనం టిక్కెట్లు రూ.1.16 లక్షలు, షాపుల ద్వారా ఆదాయం రూ.23 వేలు, విరాళాలు రూ.8.011లు, కట్నకానుకలు రూ.31,895లు, హుండీ ఆదాయం రూ.1.46 లక్షలు, ఇతర ఆదాయం రూ.13,516లు వచ్చినట్లు ఆలయ మేనేజర్ ఎస్‌వీడీ ప్రసాద్, ఆలయ చైర్మన్ శివలీలకృష్ణలు పేర్కొన్నారు. జాతరకు సహకరించిన సర్పంచ్‌లు, పంచాయతీ సిబ్బంది, ఆరోగ్య సిబ్బంది, పోలీసులకు, భక్తులకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో దేవాదాయ ఇన్‌స్పెక్టర్ ఆర్ సమత, సొసైటీ మాజీ చైర్మన్ మల్లేశ్వరరావు, లక్ష్మయ్య, సాయిని రవి, విజయ్‌కుమార్ పాల్గొన్నారు.

చర్యలు తీసుకోవాలి

సత్తుపల్లిటౌన్: సత్తుపల్లిలో అనుమతిలేని విద్యాసంస్థలపై అధికారులు చర్యలు తీసుకోవాలని పీడీఎస్‌యూ పట్టణ కార్యదర్శి కె.రమ్య డిమాండ్ చేశారు. స్థానిక నీలం రామచంద్రయ్య భవనంలో గురువారం జరిగిన సమావేశంలో ఆమె మాట్లాడారు. అనుమతి లేకుండా అడ్మిషన్లు చేసుకుంటూ.. విద్యార్థులను, తల్లిదండ్రులను మోసం చేస్తున్నారని ఆరోపించారు. పర్మిట్ లేని స్కూల్ బస్సులను సీజ్ చేసి విద్యాసంస్థలపై క్రిమినల్ కేసులు నమోదు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఆదర్శ్, అంజలి, నవీన్, సునీల్ పాల్గొన్నారు.

ఎయిడ్స్‌పై అవగాహన

ముదిగొండ: ముదిగొండలో ఎయిడ్స్‌పై అవగాహన కళాజాత గురువారం నిర్వహించారు. ఎయిడ్స్ వ్యాధి రాకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలు పల్లె సుద్దులు ద్వారా కాంపాటి శ్రీనివాస్ కళాబృందం ఆట, పాటల ద్వారా ప్రజలకు వివరించారు. కార్యక్రమంలో అదనపు డీఎంహెచ్ఓ ప్రవీణ, డీఎల్‌ఓ నాగయ్య, సర్పంచ్ లక్ష్మి, కళాజాత బృందం సభ్యులు పాల్గొన్నారు.

సీసీరోడ్డు పనులకు శంకుస్థాపన

సత్తుపల్లిటౌన్: పట్టణంలోని గాంధీనగర్‌లో రూ.5లక్షలతో చేపట్టే సీసీరోడ్డు పనులకు మున్సిపల్ చైర్మన్ కూసంపూడి మహేష్, కౌన్సిలర్ గుండ్ర రాఘవేందర్ శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ కె.సుజాత, ఏఈ సురేష్, కౌన్సిలర్ అద్దంకి అనీల్, వర్క్ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాసరావు పాల్గొన్నారు.

ఆటో స్టార్టర్లు తొలగించాలి

తల్లాడ: రైతులు తమ వ్యవసాయ మోటార్లకు ఉన్న ఆటో స్టార్టర్లను తొలగించి కెపాసిటర్లను అమర్చుకోవాలని తల్లాడ విద్యుత్ శాఖాధికారి రాజేష్ అన్నారు. గురువారం తల్లాడ మండలం తెలగవరం, రేజర్ల గ్రామాల్లో విద్యుత్ శాఖా సిబ్బంది ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏఈ మాట్లాడుతూ.. ఆటో స్టార్టర్ల వల్ల విద్యుత్, నీరు వృథా అవుతుందన్నారు. కెపాసిటర్లను పెట్టుకోవడంతో విద్యుత్ ఓల్టేజీ పెరగడంతో పాటు విద్యుత్ ఆదా అవుతుందన్నారు. ఈ కార్యక్రమంలో విద్యుత్ శాఖా సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

నిరసనకు తరలిన ఉపాధ్యాయులు

మధిర: ఉపాధ్యాయుల సమస్యలపై ఈ నెల 24న ఢిల్లీలో జరిగే నిరసన కార్యక్రమానికి అఖిలభారత ఉపాధ్యాయ సంఘం, తెలంగాణ యూటీఎఫ్ ఆధ్వర్యంలో నాయకులు వెళ్లారు. ఈ సందర్భంగా ధనిశెట్టి భాస్కరరావు, భీమ్ శంకరరావు, ఊట్ల కొండలరావు ఆధ్వర్యంలో పలువురు ఉపాధ్యాయులు బుధవారం అర్ధరాత్రి ఢిల్లీ బయలుదేరి వెళ్లారు. ఈ సందర్భంగా వారికి యూటీఎఫ్ జిల్లా, మండల నాయకులు వీడ్కోలు పలికారు.

బీజేపీ పాలనలోనే ఆర్థికాభివృద్ధి

తల్లాడ: బీజేపీ పాలనలోనే ఆర్థికాభివృద్ధి సాధ్యమని బీజేపీ తల్లాడ మండల అధ్యక్షుడు ఆపతి వెంకటరామారావు అన్నారు. తల్లాడలో గురువారం వీధి సమావేశాల్లో ఆయన మాట్లాడారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం పేద, మధ్య తరగతి ప్రజలకోసం అనేక సంక్షేమ పథకాలను ప్రవేశపెట్టి విజయవంతంగా అమలు చేస్తున్నారని అన్నారు. బీజేపీ సుపరిపాలనపై తల్లాడలో కార్యకర్తలు విస్తృత ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో బీజేపీ మండల కార్యదర్శి గాదె కృష్ణారావు, యుద్దనపూడి శ్రీనివాసరావు, నాగేశ్వరరావు పాల్గొన్నారు.

పోడు భూములను పరిశీలించిన ఆర్డీఓ



రైతులతో మాట్లాడుతున్న ఆర్డీఓ రవీంద్రనాద్

ఎర్రుపాలెం: మండలంలోని అయ్యవారిగూడెం గ్రామంలో గురువారం రైతుల పోడు భూములను ఖమ్మం ఆర్డీఓ రవీంద్రనాద్ పరిశీలించారు. స్థానికంగా ఆ భూముల్లో సాగు చేసుకుంటున్న రైతులు పోడు పట్టాలు మంజూరు చేయాలని ఖమ్మంలో ఇటీవల పరిష్కృతి కార్యక్రమంలో జిల్లా కలెక్టర్‌ను కలిసి వినతిపత్రం అందించారు. కలెక్టర్ ఆదేశాల మేరకు ఆర్డీఓ అయ్యవారిగూడెం గ్రామానికి వచ్చి పరిశీలన చేశారు. గురువారం గ్రామ పంచాయతీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో రైతులతో మాట్లాడి వివరాలు సేకరించారు. సత్వర చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఈయన వెంట తహసీల్దార్ తిరుమలాచారి, సర్పంచ్ గోసు రామారావు తదితరులు ఉన్నారు.

ఉన్నత స్థానాలకు చేరుకోవాలి



విద్యార్థినులకు స్టడీ మెటీరియల్ అందజేస్తున్న ఎంపీడీఓ, తహసీల్దార్

చింతకాని: విద్యార్థులు అందుబాటులో ఉన్న సౌకర్యాలను వినియోగించుకుంటూ చదువుకుని ఉన్నత స్థానాలకు చేరుకోవాలని ఎంపీడీఓ శ్రీనివాసరావు, తహసీల్దార్ మంగీలాల్ సూచించారు. మండలంలోని లచ్చగూడెం కేజీబీవీలో పదో తరగతి విద్యార్థులకు అమెరికాకు చెందిన గ్రేటర్ అట్లాంట తెలంగాణ సొసైటీ బాధ్యులు స్టడీ మెటీరియల్‌ను గురువారం అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ, తహసీల్దార్ మాట్లాడుతూ ప్రభుత్వంతో పాటు దాతలు సమకూరుస్తున్న సౌకర్యాలను సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. సర్పంచ్ గురిజాల ఝాన్సీ, వైస్ ఎంపీపీ గురిజాల హన్మంతరావు, కేజీబీవీ ప్రత్యేకాధికారి మంజుల, ఉద్యోగులు రాజ్యలక్ష్మి, కే.ఎస్.కృష్ణారావు, శ్రీరాంకుమార్ తదితరులు పాల్గొన్నారు.

వయోవృద్ధుల పోషణ, సంక్షేమ చట్టంపై అవగాహన



మాట్లాడుతున్న నాగేశ్వరరావు

కల్లూరు: తల్లిదండ్రులు, వయోవృద్ధుల పోషణ, సంక్షేమ చట్టంపై స్థానిక శ్రీసాయిరామ ధ్యాన మందిరంలో గురువారం అవగాహన సదస్సు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆలిండియా సీనియర్ సిటిజన్ కాన్ఫడరేషన్ సెంట్రల్ కౌన్సిల్ సభ్యుడు మాధవరపు నాగేశ్వరరావు మాట్లాడుతూ అందరిలాగే వయోవృద్ధులకు హక్కులు, చట్టాలు ఉన్నాయని తెలిపారు. హిందూ దత్తత, పోషణ చట్టం 1956 ప్రకారం వృద్ధులైన తల్లిదండ్రుల పోషణ బాధ్యత పిల్లలదేనని చెప్పారు. ఈవిషయంలో ఇబ్బంది ఎదురైతే న్యాయసాయం అందించేందుకు హెల్పేజ్ ఇండియా తదితర సంస్థలు కృషి చేస్తున్నాయన్నారు. సాయం అవసరమైన వారు టోల్‌ఫ్రీ నంబర్ 18001801253ను ఆశ్రయించాలని సూచించారు. ఇంకా ఈ కార్యక్రమంలో వివిధ అసోసియేషన్ల బాధ్యులు శ్యాం, అశోక్, హన్మంతరావు, హరి, మైలవరపు నగేష్, వేల్పుల కృష్ణయ్య, తల్లపురెడ్డి నర్సిరెడ్డి, కడియాల ఫ్రాన్సిస్ తదితరులు పాల్గొన్నారు.

నట్టల నివారణ మందు వేయించాలి



మేకకు మందు వేస్తున్న దృశ్యం

మధిర: రైతులు, పశువుల పెంపకం దారులు గొర్రెలు, మేకలకు నట్టల నివారణ మందు వేయించాలని మధిర మున్సిపల్ వైస్ చైర్‌పర్సన్ శీలం విద్యాలత వెంకటరెడ్డి అన్నారు. మండలంలోని మల్లవరం, ఖమ్మంపాడు, మడుపల్లి గ్రామాల్లో మండల పశు సంవర్ధక శాఖ ఆధ్వర్యంలో గురువారం నట్టల నివారణ వైద్య శిబిరాలను ఆ గ్రామాల ప్రజాప్రతినిధులు ప్రారంభించారు. ఈ శిబిరంలో మల్లవరం సర్పంచ్ మందడపు ఉపేందర్, వైద్యాధికారి ఉమా కుమారి, కౌన్సిలర్లు తొగరు వరలక్ష్మి, మేడికొండ కల్యాణి, వెటర్నరీ లైవ్ స్టాక్ ఆఫీసర్ ఎండీ రఫీ, ఆర్.కృష్ణయ్య, లక్ష్మణరావు, జూనియర్ వెటర్నరీ ఆఫీసర్ కొండలరావు, వెటర్నరీ అసిస్టెంట్ భారతి, సిబ్బంది జాన్ బి.కరీమున్, వెంకటేశ్వర్లు, గోపాల మిత్రలు పాల్గొన్నారు.

ఐఎన్‌టీయూసీ ప్లీనరీలో పాల్గొన్న నాగేశ్వరరావు



ఐఎన్‌టీయూసీ జాతీయ అధ్యక్షుడు సంజీవరెడ్డిని సన్మానిస్తున్న నాగేశ్వరరావు

సత్తుపల్లి: సత్తుపల్లి సింగరేణి ఉపరితల బొగ్గు గనుల సమస్యలను ఢిల్లీలో జరిగిన ఐఎన్‌టీయూసీ ప్లీనరీ సమావేశాల దృష్టికి సత్తుపల్లికి చెందిన ఐఎన్‌టీయూసీ సెంట్రల్ కౌన్సిల్ సెక్రటరీ రావి నాగేశ్వరరావు తీసుకెళ్లారు. ఐఎన్‌టీయూసీ జాతీయ అధ్యక్షుడు సంజీవరెడ్డి, సెక్రటరీ జనరల్ జనక్ ప్రసాద్‌ల ఆహ్వానం మేరకు ఢిల్లీలో జరిగిన ఐఎన్‌టీయూసీ ప్లీనరీ సమావేశాలకు ఆయన హాజరై మాట్లాడారు. బొగ్గు గనుల్లో సింగరేణి కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలను, కాంట్రాక్టు కార్మికుల వెతలు తదితర సమస్యలను ఐఎన్‌టీయూసీ జాతీయ అధ్యక్షుడు సంజీవరెడ్డి, సెక్రటరీ జనరల్ జనక్ ప్రసాద్‌లకు దృష్టికి తీసుకెళ్లి చర్చించామన్నారు. ఈ కార్యక్రమంలో ఇల్లెందు, కొత్తగూడెం, మణుగూరు ఐఎన్‌టీయూసీ నేతలు త్యాగరాజన్, ఎన్.శ్రీనివాసరావు, ఆలబర్ట్ పాల్గొన్నారు.

మెనూ ప్రకారం ఆహారం అందించాలి

ఏన్కూరు: చిన్నారులకు మెనూ ప్రకారం ఆహారం అందించాలని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ రేఖాభాయి తెలిపారు. మండలంలోని రాజలింగాలలో అంగన్‌వాడీ కేంద్రాన్ని గురువారం ఆమె సందర్శించారు. ఈ సందర్భంగా రిజస్టర్ల ప్రకారం ఆహారం నిల్వలను తనిఖీ చేశారు. అనంతరం ఆమె మాట్లాడుతూ.. చిన్నారులకు క్రమం తప్పకుండా వ్యాక్సిన్ ఇవ్వాలన్నారు. గర్భిణలు, బాలింతలు ఆరోగ్య జాగ్రత్తలు తీసుకోవాలని కోరారు.

విచారణ జరిపించండి

కల్లూరు రూరల్: డబుల్ బెడ్‌రూం లబ్ధిదారుల ఎంపికలో అవకతవకలు జరిగాయని సమగ్ర విచారణ జరిపించాలని టీపీసీసీ ప్రధాన కార్యదర్శి మానవతారాయ్ తెలిపారు. గృహాలు రాని గృహ బాధితులతో కలిసి గురువారం కల్లూరు తహసీల్దార్ బాబ్జి ప్రసాద్‌ను కలిశారు. లాటరీలో గృహాలు పొందిన అనర్హుల జాబితాను తహసీల్దార్‌కు అందించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు, దీక్ష చేపట్టిన పలువురు మహిళలు పాల్గొన్నారు.

పాస్టర్లకు జీవన భృతి ఇవ్వాలి



మాట్లాడుతున్న ఎన్‌సీసీ రాష్ట్ర అధ్యక్షుడు కరుణాకర్

సత్తుపల్లిటౌన్: పాస్టర్లు, క్రిష్టియన్లకు సీఎం కేసీఆర్ జీవన భృతి ఇవ్వాలని ఎన్‌సీసీ రాష్ట్ర అధ్యక్షుడు అలవాల కరుణాకర్ అన్నారు. క్రైస్తవుల సంక్షేమం కోసం ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం క్రిస్టియన్ మైనార్టీ కార్పొరేషన్ ఏర్పాటు చేసిందన్నారు. అలాగే తెలంగాణలో కూడా కేసీఆర్ ఏర్పాటు చేయాలన్నారు. సత్తుపల్లి లోని లక్ష్మీప్రసన్న ఫంక్షన్‌హాల్‌లో గురువారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు శ్రీనివాస్, విజయ్‌కుమార్, పాల్‌రాజ్, మేషక్, సత్యానందం, మ్యాథ్యూ, కరుణతేజ, ఏసుపాదం, రవికిరణ్ పాల్గొన్నారు.

ఏఐసీసీ మెంబర్‌గా మాజీ మంత్రి సంభాని

సత్తుపల్లి: మాజీ మంత్రి సంభాని చంద్రశేఖర్‌ని ఏఐసీసీ మెంబర్‌గా నియమిస్తూ ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖార్గే గురువారం ఉత్తర్వులు జారీ చేశారు. ఈ నియమకం పట్ల కాంగ్రెస్ అధినేత సోనియాగాంధీ, రాహుల్ గాంధీ, టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి, సీఎల్పీ నేత భట్టి విక్రమార్క కు కృతజ్ఞతలు తెలిపారు. సత్తుపల్లి బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు అప్పారావు, మండల పట్టణ అధ్యక్షుడు శివా వేణు, సాల్మన్‌రాజు, కృష్ణ అభినందనలు తెలిపారు.

గిరిజనులకు అండగా టీజీఎస్

కారేపల్లి: గిరిజనులకు అనునిత్యం అండగా తెలంగాణ గిరిజన సంఘం (టీజీఎస్) ఉంటుందని ఆ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి భూక్యా వీరభద్రం అన్నారు. ఈ నెల 25న కారేపల్లిలో జరగనున్న తెలంగాణ గిరిజన సంఘం జిల్లా మహాసభ విజయవంతానికి ప్రచార జాతాను కారేపల్లి మండల జెడ్పీటీసీ జగన్‌తో కలిసి జెండా ఊపి, ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఉసిరికాయలపల్లి సర్పంచ్ భన్సిలాల్, గిరిజన సంఘం మండల అధ్యక్షుడు శోభన్‌నాయక్, గాంధీ, సక్రునాయక్, శ్రీను నాయక్, రాములు తదితరులు పాల్గొన్నారు.

కేసీఆర్‌తోనే బంగారు తెలంగాణ సాధ్యం



గ్రామస్తులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే లావుడ్యా రాములునాయక్

కారేపల్లి: సీఎం కేసీఆర్‌తోనే బంగారు తెలంగాణ సాధ్యమని వైరా ఎమ్మెల్యే లావుడ్యా రాములునాయక్ అన్నారు. గురువారం కారేపల్లి మండలంలోని గేట్ రేలకాయలపల్లి, రంగురాళ్ళబోడు, రేలకాయలపల్లి గ్రామాలలో పర్యటించి, ప్రజల సమస్యలను తెలుసుకుంటూ ముందుకు సాగారు. రేలకాయలపల్లి సమీపంలో రైల్వే అండర్ గ్రౌండ్ బ్రిడ్జి పనులను పరిశీలించారు. రంగురాళ్లబోడులో గిరిజనుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ మాళోత్ శకుంతల, మండల అధ్యక్షుడు పెద్దబోయిన ఉమాశంకర్, వైస్ ఎంపీపీ రావూరి శ్రీనివాసరావు, నాయకులు సత్యనారాయణ, రాంబాబు, వీరన్న, రమణ, పుల్లారావు, శ్రీను, శంకర్, లక్ష్మన్, ఉపేందర్, రోషయ్య, నరేష్, రఘు, రాంబాబు, ముత్యాలరావు, రామారావు తదితరులు పాల్గొన్నారు.

'కార్పొరేట్లకు మేలు చేస్తున్న కేంద్రం'



మాట్లాడుతున్న పోతినేని సుదర్శన్‌రావు

బోనకల్: కేంద్ర ప్రభుత్వం కార్పొరేట్లకు దేశాన్ని తాకట్టుపెట్టి, ప్రభుత్వ సంస్థలను ప్రైవేట్ పరం చేస్తుందని తెలంగాణ రైతుసంఘం రాష్ట్ర అధ్యక్షుడు పోతినేని సుదర్శన్‌రావు అన్నారు. మండలకేంద్రంలోని సీపీఎం కార్యాలయంలో గురువారం కార్మిక, కర్షక మండలస్థాయి సదస్సు జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. కార్మిక నల్ల చట్టాలను రద్దు చేయాలన్నారు. బడ్జెట్‌లో కార్మికరంగానికి స్వల్పనిధులు కేటాయిస్తూ పేద ప్రజల ఉపాధిని దెబ్బతీస్తున్నారని తెలిపారు. బీజేపీ ప్రభుత్వాన్ని విమర్శిస్తే ఐటీ, సీబీఐ దాడులు చేయిస్తూ బెదిరిస్తున్నారన్నారు. బీజేపీ వ్యతిరేక విధానాలను నిరసిస్తూ మార్చి 15న ప్రజాగర్జన యాత్రను ప్రారంభిస్తున్నట్లు తెలిపారు. ఈ సమావేశంలో సీఐటీయూ జిల్లా కార్యదర్శి కల్యాణం వెంకటేశ్వరావు, వ్యవసాయ కార్మికసంఘం జిల్లా కార్యదర్శి వెంకటేశ్వర్లు, నాయకులు శ్రీను, కోటేశ్వరావు, రమేష్, నాగేశ్వరావు, ఎంపీపీ సౌభాగ్యం, నరేష్, వెంకటరాజ్యం, రవి, సునీత తదితరులు పాల్గొన్నారు.

బాల్య వివాహాలపై అవగాహన



అవగాహన కల్పిస్తున్న రూరల్ ఎస్సై

మధిర: మండలంలోని మాటూరు హైస్కూల్ విద్యార్థులకు గురువారం ఐసీడీఎస్, పోలీస్ శాఖ సంయుక్త ఆధ్వర్యంలో బాల్య వివాహాలపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఐసీడీఎస్ మధిర ప్రాజెక్ట్ సీడీపీఓ శారదా శాంతి, రూరల్ ఎస్సై నరేష్ మాట్లాడుతూ.. బాల్యవివాహాలు చేయడం నేరమని, అవి జరగకుండా చూడాల్సిన బాధ్యత సమాజంపై ఉందన్నారు. గ్రామాల్లో బాల్యవివాహాలు జరిగితే పోలీస్ శాఖ వారికి 1098 ఫోన్ చేసి సమాచారం అందజేస్తే వెంటనే చర్యలు తీసుకుంటామన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు సాయి కృష్ణమాచార్యులు, సర్పంచ్ లీలావతి, ఎంపీటీసీ వెంకటేశ్వర్లు, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ అన్నపూర్ణ, పాఠశాల ఉపాధ్యాయులు, అంగన్వాడీ సిబ్బంది పాల్గొన్నారు.

ఎమ్మెల్యే సండ్రకు జర్నలిస్టుల సన్మానం

పెనుబల్లి: సత్తుపల్లి ఎమ్మెల్యే సండ్ర వెంకటవీరయ్యను పెనుబల్లి ప్రెస్ క్లబ్ ఆధ్వర్యంలో జర్నలిస్టులు గురువారం ఘనంగా సన్మానించారు. పెనుబల్లి మండలంలోని జర్నలిస్టులకు ఇళ్ల స్థలాలు కేటాయిస్తానని హామీ ఇవ్వడంతో జర్నలిస్టులు ఆయనను తెలగవరంలో కలుసుకొని, ఆయనతో పాటు ఎంపీ నామా నాగేశ్వరరావును గజమాల, శాలువాలతో సన్మానించారు. ఇళ్ల స్థలాలు త్వరిత గతిన అందేలా చూస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో జర్నలిస్టు సంఘ నాయకులు బొర్రా కోటేశ్వరరావు, ఎస్‌కే సలీం, వంగా సత్యనారాయణ, వంగా షణ్ముఖ, జె.వి. రత్న, మల్లెల రాజా, రామిశెట్టి రమేష్, ఎస్‌కే బాజీ, కిరణ్, నాగప్రసాద్, నరసింహారావు, ప్రకాశ్ తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్‌లోనే కొనసాగుతున్నాం..



మాట్లాడుతున్న కాంగ్రెస్ పార్టీ కౌన్సిలర్లు

వైరా: వైరా మున్సిపాలిటీలో జరుగుతున్న పరిణామాలపై ఇటీవల మున్సిపాలిటీ పరిధిలోని 2, 15వ వార్డు కౌన్సిలర్లు బత్తుల గీత, గుడిపూడి సురేష్‌లు గురువారం కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. స్థానిక ఎమ్మెల్యే రాములునాయక్ ఇటీవల మున్సిపాలిటీకి ప్రకటించిన రూ.30 కోట్ల నిధులు తమ వార్డులకు కేటాయిస్తామని హామీ ఇచ్చారని ఆ సమయంలోనే మున్సిపల్ చైర్మన్ అవిశ్వాస తీర్మానానికి మద్దతు తెలిపామన్నారు. అంతేకాని ఏ ఇతర ప్రయోజనాల కోసం కాదని తాము కాంగ్రెస్ పార్టీ కౌన్సిలర్లగానే కొనసాగుతామని పేర్కొన్నారు. ఈ సమావేశంలో మండల కాంగ్రెస్ అధ్యక్షుడు శీలం వెంకటనర్సిరెడ్డి యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు పమ్మి అశోక్, నాయకులు పాలేటి నరసింహారావు, కొండలు, శ్రీను, తిరపతిరావు, ఆనందరావు, కిరణ్ తదితరులున్నారు.

బ్యాంకు ఎదుట రైతుల ఆందోళన

కల్లూరు రూరల్: రైతులందరికీ లక్ష రూపాయలు రుణమాఫీ చేయాలని డిమాండ్ చెస్తూ తెలంగాణ రైతుల సంఘం ఆధ్వర్యంలో గురువారం కల్లూరు మండలం చెన్నూరు ఏపీ గ్రామీణ వికాస్ బ్యాంక్ ఎదుట ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా జిల్లా కార్యదర్శి బొంతురాంబాబు మాట్లాడుతూ.. ముఖ్యమంత్రి కేసీఆర్ రైతులకు లక్ష రుణమాఫీ హామీ నేటికి అమలు చేయలేదన్నారు. అనంతరం బ్యాంకు మేనేజర్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు మెరుగు సత్యనారాయణ, సభ్యులు కృష్ణార్జున రావు, హనుమంతరావు, అంజయ వెంకటేశ్వరరావు, నరసింహారావు, మల్లయ్య, అజయ్‌కుమార్, రామనాధం, శ్రీను, జమలయ్య, చందర్రావు, నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

జయమ్మ కుటుంబాన్ని పరామర్శించిన పొంగులేటి

మధిర: మండలంలోని చిలుకూరు గ్రామ మాజీ సర్పంచ్ నిడమానూరు జయమ్మ కుటుంబాన్ని బుధవారం రాత్రి ఖమ్మం మాజీ పార్లమెంట్ సభ్యుడు పొంగులేటి శ్రీనివాసరెడ్డి పరామర్శించారు. ఇటీవల జయమ్మ కుమారుడు అనారోగ్యంతో మృతి చెందారు. విషయం తెలుసుకున్న పొంగులేటి చిలుకూరు వెళ్లి మృతుడి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించి వారి కుటుంబానికి సానుభూతి తెలిపారు. ఆయన వెంట డీసీసీబీ డైరెక్టర్ వెంకటేశ్వరరెడ్డి, ప్రముఖ వైద్యుడు రాంబాబు, అమరవాది సత్యనారాయణరెడ్డి, పరిమి బెంజిమన్, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

మట్టా దయానంద్‌ను పరామర్శించిన తుమ్మల

సత్తుపల్లి: ఇటీవల గుండెపోటుతో చికిత్స చేయించుకున్న డాక్టర్ మట్టా దయానంద్ విజయ్‌కుమార్‌ను మాజీమంత్రి తుమ్మల నాగేశ్వరరావు గురువారం ఆయన నివాసంలో కలిసి పరామర్శించారు. ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో డాక్టర్‌మట్టా రాగమాయి, సీనియర్ నాయకులు నర్సింహారావు, ప్రసాదరావు, శ్రీనివాసరావు, వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

అటెన్షన్ ప్లీజ్

ఎన్నెస్పీ కాల్వలు అధ్వానం



సాగర్ కాల్వలు అధ్వానంగా మారాయి. పిచ్చి చెట్లు, కంప చెట్లు ఏపుగా పెరిగిపోయాయి. నీరు విడుదలయినా పొలాలకు సరిగ్గా చేరని పరిస్థితి నెలకొంది. ఈ ఏడాది రబీలో ఎన్నెస్పీ ద్వారా సాగు నీటి సరఫరా జరుగుతుందని అధికారులు ప్రకటించారు. తల్లాడ మైనర్ కాల్వలో నీటి సరఫరా తక్కువ స్థాయిలో ఉంటుంది. మేజర్లకు కనీస మరమ్మతులు లేకపోవటం, మైనర్ కాలువల మరమ్మతులు పూర్తిగా గాలికి వదిలేయడంతో సాగు నీరు ముందుకు కదలడం లేదు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి ఎన్నెస్పీ కాల్వలను శుభ్రం చేయాలని రైతులు కోరుతున్నారు.

– తల్లాడ

ప్రశ్నించాల్సిన అధికారి : శ్రీనివాసరావు, నీటి పారుదల శాఖ డీఈ, తల్లాడ
సెల్ నంబర్ : 9440802868